## క్లుప్తంగా

### బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

**పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి**



పార్టీ సభ్యత్వ నమోదు చేపడుతున్న శ్రీధర్‌రెడ్డి

**షాబాద్:** బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాగర్‌గూడ గ్రామంలో ఇంటింటికీ తిరిగి బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మోదీ చేసున్న అభివృద్ధి పనులు, పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ఎన్నికల హామీల విఫలంపై ప్రజలకు వివరించాలన్నారు. ప్రతీ నాయకుడు తప్పకుండా 200 వరకు సభ్యత్వాలను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు పంతులు అనంతం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మహేందర్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, మండల అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

### డ్రైవర్స్ అసోసియేషన్ ఏర్పాటు



నూతన కార్యవర్గంతో నాయకులు

**కడ్తాల్:** సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య ఆధ్వర్యంలో ఆదివారం సీఐటీయూ కడ్తాల్ అనుబంధ డ్రైవర్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా మల్లేశ్, ప్రధాన కార్యదర్శిగా బండపాండు, కోశాధికారిగా శ్రీను, ఉపాధ్యక్షులుగా మూడ శ్రీశైలం, నర్సింహ, సహాయ కార్యదర్శిగా రాఘవేందర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాశ్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

### రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**మాడ్గుల:** రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పాల శీతలీకరణ కేంద్రం అభివృద్ధికి చైర్మన్ బొజ్జ సాయిరెడ్డి కోరిక మేరకు ఆదివారం రూ.30 లక్షల ప్రొసీడింగ్ కాపిని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుతం పాల శీతలీకరణ కేంద్రం సామర్థ్యం 8 వేల లీటర్లు ఉందని చెప్పారు. మరో 10వేల లీటర్ల సామర్థ్యం పెంచేందుకు నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొండల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నియామకం

**తలకొండపల్లి:** ముదిరాజ్ తలకొండపల్లి గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల అధ్యక్షుడు బోళ్ల యాదయ్య, తాలూకా కార్యదర్శి అనిల్, సీనియర్ నాయకులు పాండు ప్రసాద్, రొయ్యల యాదయ్యల సమక్షంలో కమిటీని ఏకగ్రీవం చేశారు. సంఘం అధ్యక్షుడిగా బోళ్ల బాలయ్య, ఉపాధ్యక్షులుగా శ్రీరాములు, కాటికి రాములు, కోశాధికారిగా నూకం కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్, కార్యదర్శిగా సురేష్, మరో 15 మందిని కార్యవర్గ సభ్యులుగా నియమించారు.

### బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవం



బోనాలతో ఊరేగింపుగా బొడ్రాయి వద్దకు వెళ్తున్న గిరిజనులు

**కడ్తాల్:** మండల పరిధి కానుగుబావితండాలో బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు కలశాలతో ఊరేగింపుగా వెళ్లి.. బొడ్రాయికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మాజీ ఉప సర్పంచ్ శారద, నాయకులు పాండునాయక్, నర్సింగ్, శ్రీను, లక్ష్మణ్, రాజు, వినోద్, జాన్యు, దేవుల, శంకర్, నాగార్జున, శ్రీను, కిషన్, రాజు, సేవ్యా, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇరుకురోడ్డుతో ఇక్కట్లు

- సింగిల్ వేతో ఇబ్బందిపడుతున్న వాహనదారులు
- రెండు వరుసలుగా మార్చాలని వినతి
- పట్టించుకోని అధికారులు



అప్పారెడ్డిగూడ, వీర్లపల్లి మధ్యలో నిలిచిపోయిన వాహనాలు

**నందిగామ:** మండల పరిధిలోని చంద్రాయన్‌గూడ నుంచి మామిడిపల్లి వెళ్లే రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చాయంటే చాలు ట్రాఫిక్ జామ్ కావాల్సిందే. ఈ రోడ్డు మీదుగా అనునిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగుతుంటాయి. వీటితో పాటు మొదళ్లగూడ శివారులోని అంతర్జాతీయ యూనివర్సిటీకి కార్లు, బస్సులు, వీర్లపల్లి శివారులోని స్పాంజ్ ఐరన్ పరిశ్రమలకు వందలాది లారీలు వస్తుంటాయి. ఈ నేపథ్యంలో రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చాయంటే చాలు ఏ వాహనం రోడ్డు దిగాలో తెలియక ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతున్నాయి. ఏ వాహనం దిగితే ఎక్కడ కింద పడిపోతుందో అనే భయాందోళనలతో ఆయా వాహనాల డ్రైవర్లు గొడవలకు దిగుతున్నారు. తాజాగా ఆదివారం అప్పారెడ్డిగూడ, వీర్లపల్లి మధ్యలో మూడు బస్సులు, రెండు లారీలు ఎదురెదురుగా రావడంతో అక్కడ ముందుకు కదలక, వెనకకు వెళ్లలేక సుమారు 30 నిమిషాల పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. అతి కష్టం మీద బస్సు డ్రైవర్ తన బస్సును కొంత మేరకు రోడ్డు కిందకు దింపడంతో మిగతా వాహనాలు వెళ్లిపోయాయి. ఈ రోడ్డును రెండు వరుసల రహదారిగా మార్చేందుకు అధికారులకు ప్రతిపాదనలు పంపారు. కానీ ఇప్పటివరకు ప్రతిపాదనలకు మాత్రమే పరిమితమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వీలైనంత తొందరగా రెండు వరుసల రహదారిగా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైర్మన్ భారతి, శ్రీనివాస్

**మొయినాబాద్‌రూరల్:** ప్రతి నిత్యం యోగ సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అజీజ్‌నగర్ యోగా సెంటర్ చైర్మన్ భారతీ, డైరెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం అజీజ్‌నగర్ యోగా సెంటర్ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బుద్ధుడి విగ్రహానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. సమాజంలో మారుతున్న కాలానికి అనుగుణంగా తీసుకునే ఆహార పదార్థాలు మందులతో పండిస్తున్నారని, దీంతో శరీరంలో అనేక రోగాలు తయారవుతున్నాయని తెలిపారు. ఇష్టం వచ్చినట్లు ఏది పడితే అది తినడంతో ఆరోగ్యం చెడిపోతుందని, పోషకాహారంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# యువకులకు సన్మానం



యువకులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్‌రూరల్:** ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో జిల్లేడ్‌చౌదరిగూడ మండలం జాకారం గ్రామానికి చెందిన యువకులు వెంకటేశ్, శ్రీనివాసులు జిల్లాస్థాయిలో సత్తాచాటారు. ఈ సందర్భంగా పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆ యువకులను ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘనంగా సన్మానించారు. వెంకటేశ్ జిల్లాస్థాయిలో 7వ ర్యాంకును సాధించి సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఎంపికయ్యాడు. శ్రీనివాసులు మహబూబ్‌నగర్ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్ విభాగంలో జిల్లా మొదటి ర్యాంకును సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మారుమూల గ్రామాలకు చెందిన యువకులు డీఎస్సీ ఫలితాల్లో జిల్లాస్థాయిలో సత్తాచాటడం హర్షణీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు అందుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. రాబోయే రోజులలో ఉన్నత పౌరులుగా ఎదిగి తల్లితండ్రులకు, గురువులకు, గ్రామానికి మంచి పేరుప్రఖ్యాతులను తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కొందుర్గు మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జాకారం మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్, సత్యనారాయణరెడ్డి, కమ్మరి నర్సింలు, ఆనంద్, రాఘవేందర్, మహేశ్, ఆంజనేయులు, మారుతీ, యాదయ్యగౌడ్, నరేందర్, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు మంత్రి పర్యటన

**ఆమనగల్లు:** కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో సోమవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జగన్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటగా కడ్తాల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి పర్యటనలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, మంత్రి పర్యటనను జయప్రదం చేయాలని కోరారు.

# దళితులకు ఇళ్లు మంజూరు చేయాలి

**కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాశ్**

**తలకొండపల్లి:** ఇళ్లు లేని దళితులకు స్థలం ఇచ్చి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కేవీపీఎస్ (కుల వివక్ష పోరాట సమితి సంఘం) జిల్లా కార్యదర్శి ప్రకాష్ కరత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం ఏర్పడి 26 సంవత్సరాలు అయిన సందర్భంగా మండల పరిధి లింగరావుపల్లిలో ఆదివారం సంఘం నాయకులు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ.. అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్, కొత్తరేషన్ కార్డులు, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య, మాజీ సర్పంచ్ ఎల్లమ్మ, తిరుపతయ్య, యాదయ్య, అంజయ్య, కుమార్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థికి అభినందన

**చేవెళ్ల:** ఎంబీబీఎస్‌లో ఫ్రీ సీటు సాధించిన పారిశుద్ధ్య కార్మికుడి కూతురు హిందూను అంబేడ్కర్ సంఘం అధ్వర్యంలో దళిత రత్న అవార్డు గ్రహీత బురాన్ ప్రభాకర్ ఘనంగా సన్మానించి, 10వేల రూపాయల ప్రోత్సాహక సాయం అందించారు. ఆదివారం చేవెళ్లలోని పారిశుద్ధ్య కార్మికుడు సాయన్న ఇంటికి వెళ్లి ఆయన కూతురు హిందూను ప్రత్యేకంగా అభినందించి అంబేక్కర్ ఫొటోను అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుకు పేదరికం అడ్డుకాదని హిందు నిరూపించిందని, ప్రభుత్వ పాఠశాలలో చదివి ఎంబీబీఎస్ ఫ్రీ సీటు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచిందన్నారు. హిందు ఒక్కతే కాదు సాయన్న సుజాత దంపతులకు పుట్టిన ముగ్గురు పిల్లలు ఉన్నత చదువులతో సరస్వతీ పుత్రులుగా నిలవడం సంతోషకరమన్నారు. హిందుకు తమవంతు సహకారం ఎప్పుడు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఆయన వెంట మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్ బి.రాములు, చేవెళ్ల అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సున్నపు ప్రవీణ్, కోర్టు యాదయ్య, జంగయ్య, బబ్లు, సీనియర్ జర్నలిస్టులు గోపాల్, మధు, గ్రామస్తులు ఉన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న దళితరత్న అవార్డు గ్రహీత బురాన్ ప్రభాకర్ తదితరులు

# ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



మైసమ్మకు పూజలు చేస్తున్న విశాల

**జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల**

**కేశంపేట:** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సంగెం గ్రామంలో గ్రామస్తులు వనంకట్ట వద్ద మైసమ్మ తల్లి విగ్రహాన్ని నూతనంగా ఏర్పాటు చేశారు. ఈ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాల పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతతో పాటు ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. గ్రామస్తులు కలిసిమెలసి పండుగలను జరుపుకోవాలన్నారు. మైసమ్మ చల్లగా చూడాలని, పాడిపంటలు బాగా పండాలని కోరుకున్నారు.కార్యక్రమంలో శ్రావణ్‌రెడ్డి, యెన్నం శ్రీధర్‌రెడ్డి, ఇబ్రహీం , కుమ్మరి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం




సమావేశమైన పూర్వ విద్యార్థులు

**చేవెళ్ల:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు 1955 నుంచి ప్రస్తుతం చదువుతున్న బ్యాచ్ విద్యార్థులతో సమ్మేళనం నిర్వహించారు. దీనికి పూర్వ విద్యార్థుల 1981–82 బ్యాచ్‌కు చెందిన వారు ముందుకొచ్చి వచ్చే ఏడాది 2025లో పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులందరూ కలిసి పాఠశాల 70 సంవత్సరాల స్వర్ణోత్సవాలు చేయాలనే నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ విషయంపై పూర్వ విద్యార్థులకు రెడ్డిశెట్టి శ్రీనివాస్ అనే పూర్వ విద్యార్థి ముందుకొచ్చి సమాచారం అందించి ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారందరూ కలిసి చర్చించుకొని ఈ పాఠశాల అభివృద్ధిలో భాగం కావాలని నిర్ణయించారు. ఈ పాఠశాలలో 1955 నుంచి 2025 వరకు చదివిన వారందరూ కనీసం ఒక్క సంవత్సరం అయినా సమ్మేళనం నిర్వహించుకోవాలని తీర్మానించారు. దీని కోసం ప్రత్యేకంగా ఒక గోల్డెన్ జూబ్లీ వేడుకలు అనే గ్రూప్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో పూర్వ విద్యార్థులు ఈ పాఠశాలలో చదివిన వారిని యాడ్ చేయాలని సూచించారు. వచ్చే ఏడాది 2025 సంవత్సరంలో ఈ పాఠశాలలోనే ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాలని సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు అంశాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. వచ్చే ఏడాది వేడుకలు నిర్వహించే వరకు ఈ పూర్వ విద్యార్థుల సమావేశాలు నిర్వహించి ఒక ప్రణాళిక సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న శరన్నవరాత్రోత్సవాలు



షాద్‌నగర్: శివమారుతీ దేవాలయంలో శాకాంబరిదేవిగా అమ్మవారు



షాద్‌నగర్: పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**వారాహిమాతగా దర్శనమిచ్చిన అమ్మవారు**



చేవెళ్లలో..



షాద్‌నగర్‌రూరల్: వారాహిమాతగా దర్శనమిచ్చిన అమ్మవారు



షాద్‌నగర్‌రూరల్: అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



మొయినాబాద్: చిలుకూరులో దుర్గామాతకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు



కొందుర్గు: వీరన్నపేటలో..

**షాద్‌నగర్‌రూరల్:** అమ్మవారి కరుణాకటాక్షాలు మనందరిపై ఉండాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల ఎలికట్ట అంబాభవానీమాత దేవాలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ దైవచింతనను అలవర్చుకొని భక్తి మార్గంలో నడుచుకోవాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలకకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పాలవర్గసభ్యులు, భక్తులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**పట్టణంలో..**

పట్టణంలోని బంగారు మైసమ్మ దేవాలయంలో యువజన కాంగ్రెస్ నాయకులు అందె మోహన్ సౌమ్య దంపతుల ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారు వారాహిమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

**శాకాంబరిదేవిగా అమ్మవారి దర్శనం**

**షాద్‌నగర్:** పట్టణంలోని శివమారుతీ దేవాలయంలో అమ్మవారు శాకాంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా బైపాస్ రోడ్డులో ఉన్న బంగారు మైసమ్మ దేవాలయంలో అమ్మవారిని వారాహిదేవిగా అలంకరించారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బీష్వ కిష్టయ్య, నాయకులు చెంది తిరుపతి రెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, బస్వం, చింటు, గంగనమోని సత్తయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**శ్రీలలితా త్రిపురసుందరిదేవిగా దర్శనం**

**షాబాద్:** షాబాద్, తాళ్లపల్లి, మల్లారెడ్డిగూడ, హైతాబాద్, మద్దూరు, సర్దార్‌నగర్ తదితర గ్రామాల్లో దుర్గామాతలకు ప్రత్యేక పూజలు చేశారు. నాలుగోరోజు అమ్మవారు శ్రీలలితా త్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు తదితరులు ఉన్నారు.

**మండలంలో..**

**మొయినాబాద్‌రూరల్:** గ్రామాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో దుర్గామాతకు ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం నాలుగోరోజు దుర్గామాత శ్రీలలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని అమ్డాపూర్ రక్షమైసమ్మ దేవాలయం హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్, బాకారం, కనకమామిడి, తోల్‌కట్ట, నక్కలపల్లి, కేతిరెడ్డిపల్లి, ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల్లో భక్తులు పెద్దఎత్తున పూజలు నిర్వహిస్తున్నారు.

**చేవెళ్ల:** మండలంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల వద్ద అమ్మవారు లలితాత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు. చేవెళ్లలోని రచ్చబండ వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

**వేంకటేశ్వరస్వామి ఆలయంలో..**

మండల కేంద్రంలోని బాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు పూజలు, స్వామివారి హంసవాహన సేవలో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

**ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత**

**కొందుర్గు:** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరన్నపేట గ్రామంలో ఆదివారం రాత్రి నిర్వహించిన దుర్గామాత పూజా కార్యక్రమానికి ఆయన హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.



షాబాద్‌లో..



మొయినాబాద్ రూరల్: అమ్మాపూర్ రక్షమైసమ్మ దేవాలయంలో..

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
జి. మల్లికార్జున్
9505507564